అంతా మా ఇష్టం...

- గత ఏడాది నోటిఫికేషన్ ఇచ్చినా ఫలితం లేదు
- తాజాగా మరో నోటిఫికేషన్ విడుదల
- కింది స్థాయి ఉద్యోగుల ప్రమోషన్‌లలో పక్షపాతం
- అధికారుల తీరుతో నష్టపోతున్న ఉద్యోగులు
- జీజీహెచ్ అధికారుల పనితీరుపై విమర్శలు



గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: గత ఏడాది కింది స్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇస్తామని జీజీహెచ్ అధికారులు రెండు నోటిఫికేషన్లు విడుదల చేశారు. ఏడాది గడిచినా ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో నోటిఫికేషన్‌ల కాలపరిమితి దాటిపోయింది. తాజాగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును కింది స్థాయి ఉద్యోగులకు ప్రమోషన్ ద్వారా భర్తీ చేస్తామని అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. కనీసం ఈ నోటిఫికేషన్‌లోనైనా కింది స్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇస్తారా, లేక గతంలో మాదిరిగా ఏడాది పాటు కార్యాలయం చుట్టూ కింది స్థాయి ఉద్యోగులను తిప్పించుకుని ప్రమోషన్ ఇవ్వకుండా పంగనామాలు పెడతారా అనే సందేహాలు కింది స్థాయి ఉద్యోగుల్లో తలెత్తుతున్నాయి.

ఐదేళ్లగా పోస్టులు ఖాళీ..

జీజీహెచ్ పరిపాలన అధికారులు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారు. తమకు నచ్చకపోతే ఐదేళ్లగా పోస్టు ఖాళీగా ఉన్న ప్రమోషన్ ద్వారా భర్తీ చేయరు. తమకు నచ్చితే పోస్టు ఖాళీ ఏర్పడి పదిరోజులే అయినా నోటిఫికేషన్ ఇచ్చి ప్రమోషన్ ద్వారా పోస్టును భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తారు. ఆస్పత్రి అధికారులు పక్షపాత ధోరణితో సకాలంలో ప్రమోషన్లు రావటం లేదని పలువురు ఉద్యోగులు వాపోవుతున్నారు. జీజీహెచ్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేసేందుకు ఆస్పత్రి అధికారులు ఫిబ్రవరి 28న నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 7తో గడువు ముగిసింది. భర్తీ చేస్తారా, లేక కింది స్థాయి ఉద్యోగుల ప్రమోషన్‌లతో ఆటలాడతారా .. అని ఆసుపత్రి సిబ్బంది చర్చించుకుంటున్నారు.

పోస్టులు ఎగిరిపోయాయి

జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో కొన్నింటిని ఆస్పత్రిలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. సుమారు ఏడేళ్లుగా జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయలేదు. సదరు పోస్టులను అర్హత ఉండి తమకు ఇవ్వడం లేదని కొంత మంది ఉద్యోగులు కోర్టుకు వెళ్లడంతో ఖాళీ పోస్టు ఉన్నప్పుడు ఇస్తామని కోర్టుకు వివరణ ఇచ్చారు. తీరా నేడు ఖాళీగా ఉన్న మూడు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కనుమరుగైపోయాయని పోస్టులు ఖాళీ వస్తే భర్తీ చేస్తామని చెబుతున్నారు.


ఎక్సరే అటెండెంట్ పోస్టును ప్రమోషన్ ద్వారా భర్తీ చేసేందుకు విడుదల చేసిన నోటిఫికేషన్

కోర్టుకు వెళితేనే ప్రమోషన్ ఇస్తున్నారు....

ఆస్పత్రిలో ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాల్సిన పోస్టులను అధికారులు భర్తీ చేయకుండా ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారు. దీంతో పలువురు ఉద్యోగులు కోర్టుకు వెళ్లి ప్రమోషన్ పోస్టును దక్కించుకుంటున్నారు. ముఖ్యంగా నాలుగో తరగతి ఉద్యోగుల ప్రమోషన్స్‌లోనే ఇలాంటి వివక్ష ఎక్కువగా ఉందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

ప్రమోషన్‌ల కోసం పాకులాట..

కార్యాలయ అధికారులు తమ ప్రమోషన్‌ల కోసం పదే పదే సెక్రటేరియట్ చుట్టూ, డీఎంఈ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జీజీహెచ్‌లో కింది స్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాల్సిన పలువురు సీనియర్ అసిస్టెంట్లు ఆఫీస్ సూపరింటెండెంట్లుగా, ఆఫీస్ సూపరింటెండెంట్లు పరిపాలనా అధికారులుగా, పరిపాలనా అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్లుగా నాలుగేళ్లలో ప్రమోషన్లు పొందారు. తమ ప్రమోషన్‌లకు లేని అభ్యంతరాలు కింది స్థాయి ఉద్యోగులకు తరచుగా ఎందుకు వస్తున్నాయని చిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఆర్డీ కార్యాలయంలో ఫార్మాసిస్టుల ప్రమోషన్‌ల జాబితా పంపించే విషయంలో జీజీహెచ్ కార్యాలయ ఉద్యోగుల పనితీరుపై ఆరోపణలు రావడంతో చార్జి మెమోలు ఇచ్చారు. అయినప్పటికీ కార్యాలయ ఉద్యోగుల్లో ఎలాంటి స్పందన ఉండటం లేదని, కింది స్థాయి ఉద్యోగుల ప్రమోషన్‌లను కావాలనే తాత్సారం చేస్తూ మానసిక వేదనకు గురిచేస్తున్నారని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

సూపరింటెండెంట్ ఏమన్నారంటే..

పారా మెడికల్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రమోషన్ ద్వారా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. నోటిఫికేషన్ కాల పరిమితి ఉండగానే నిబంధనల ప్రకారం ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆదర్శ మహిళా అవార్డుగ్రహీత స్వర్ణలతకు సన్మానం



నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డాక్టర్ స్వర్ణలత దేవి, ఆదర్శ మహిళా అవార్డు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి అందుకోవడం హర్షణీయమని జాషువా కల్చరల్ సెంటర్ కార్యదర్శి పీవీ రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం శ్యామలానగర్‌లో స్వర్ణలత అభినందన కార్యక్రమం నిర్వహించారు. భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం మాట్లాడుతూ నేటి సమాజంలో నాలుగు దశాబ్దాలుగా పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం వెడ్స్ సంస్థ ద్వారా స్వర్ణలత చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎం.సత్యవాణి, తాళ్లూరి అమర్నాథ్, ఝాన్సీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం నేడు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాలని పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డి రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జనకళమై గర్జించి... సంక్షేమ పాలనలో నవ శకానికి నాంది పలికి, పేద ప్రజల సంక్షేమమే ఊపిరిగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకు సాగారన్నారు. నేడు జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న ఆవిర్భావ దినోత్సవాలకు కార్మికులు, కార్మిక సంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఆటో, ట్యాక్సీలతో పాటు ఇతర కార్మికులకు ఏడాదికి రూ.10 వేలు అందజేసి వారిని ఆర్థికంగా ఆదుకున్న ఘనత జగనన్నకే దక్కుతోందని చెప్పారు. కచ్చితంగా కార్మికులంతా జగనన్నకు అండగా నిలబడి తిరిగి సీఎం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకు సన్మానం



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు జీజీహెచ్‌లో ఉమెన్స్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. వేడుకల్లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, నర్సుల సంఘం నేతలు కోటమ్మ, పద్మజ, సునీత, హేమలత, ఆషాలత పాల్గొన్నారు.

న్యాయవాది సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: న్యాయవాది సంతకం ఫోర్జరీపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్యామలానగర్ ప్రాంతానికి చెందిన కళ్లం ప్రకాష్‌రెడ్డి, న్యాయవాదిగా జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నాడు. అయితే ప్రత్తిపాడు మండలానికి చెందిన త్యాగం రెడ్డి పరమేశ్వరరెడ్డి, అనే వ్యక్తి ఓ కేసు విషయంలో న్యాయవాది అయిన కళ్లం ప్రకాష్ రెడ్డి వద్దకు వచ్చి తన కేసును వాదించాల్సిందిగా చెప్పడంతో న్యాయవాది, నాలుగో అదనపు జిల్లా కోర్టులో కేసు వాదిస్తున్నాడు. అయితే ఇటీవల పరమేశ్వరరెడ్డి, న్యాయవాది ప్రకాష్‌రెడ్డికి చెప్పకుండా మరో న్యాయవాదితో మాట్లాడి తన కేసును వాదించాల్సిందిగా చెప్పి న్యాయవాది ప్రకాష్‌రెడ్డి నుంచి ఎన్ఓసీ సంతకాన్ని పరమేశ్వరరెడ్డినే స్వయంగా ఫోర్జరీ చేసి వాకాలతా దాఖలు చేశాడు. ఈ విషయం తెలుసున్న ప్రకాష్‌రెడ్డి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి వేరే న్యాయవాది వద్ద వాకాలత దాఖలు చేసినందుకు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మంగళవారం పరమేశ్వరరెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ.19 లక్షల మోసం

లక్ష్మీపురం: జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిని అని చెప్పి ఓ మహిళ బంధువుల, స్నేహితుల వద్ద ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.19 లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేట 16వ లైన్‌కు చెందిన పోకల విజయలక్ష్మి, ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. 2018లో గుంటూరు నగరంలోని పొట్టి శ్రీరాములు నగర్ ప్రాంతానికి చెందిన వలపర్ల సుస్మిత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిగా పరిచయం చేసుకుంది. తరుచూ జిల్లాలో జాబ్ మేళాల ద్వారా అనే మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంటాను అని చెప్పి నమ్మబలికింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ)లో ఖాళీలు ఉన్నాయని ఒక్కో ఉద్యోగానికి రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పి బాధితురాలు విజయలక్ష్మి బంధువులు, స్నేహితుల వద్ద నుంచి రూ.19 లక్షలు వసూలు చేసింది. ఎంతకు ఉద్యోగాలు కల్పించ కుండా కాలయాపన చేస్తున్న క్రమంలో అనుమానం కలిగి విజయలక్ష్మి, సుస్మితా గురించి విచారించగా మోసం చేసినట్లు తెలుసుకుని డబ్బు వాపస్సు చేయాల్సిందిగా కోరింది. అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల ఉండాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు


వెహికల్ షెడ్‌లో సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, ఇప్పటికే ప్రజారోగ్య విభాగం పటిష్టతకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. వెహికిల్ షెడ్, సంగడిగుంట, కొత్తపేట, రైల్ పేటలోని పలు ప్రాంతాలలో మంగళవారం పర్యటించారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు పరిశీలించారు. తొలుత నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌ని పరిశీలించి, పారిశుద్ధ్య పనులకు డివిజన్ల వారీగా కేటాయించిన ట్రాక్టర్లు, పుష్ కాట్స్, ఈ-ఆటోల గురించి ఇన్‌స్పెక్టర్లను సెట్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శానిటరీ డివిజన్లకు కేటాయించిన ట్రాక్టర్లు ఇన్‌స్పెక్టర్ల నిర్వహణలోనే ఉంటాయని, చెత్త తరలింపునకు వాహనాలు అందుబాటులో లేవనే సమస్య రాకుండా డివిజన్లకు వాహనాలు అందించామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు తప్పనిసరిగా పనుల్లోనే ఉండాలి తప్ప డెప్యూటేషన్, సూపర్వైజర్ పేరుతో ఉండడానికి వీలు లేదని స్పష్టం చేశారు. తమ రోజువారీ విధుల్లో కార్మికుల పనిని, హాజరుని తనిఖీ చేస్తామన్నారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు సీనియర్ అధికారులను కేటాయించామని, ప్రతి రోజు కార్మికుల మస్టర్, పారిశుద్ధ్య పనులు క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. శానిటేషన్ కార్యదర్శులు తప్పనిసరిగా నిర్దేశిత సమయంలో విధుల్లో ఉండాలన్నారు. అనంతరం సంగడి గుంట, కొత్తపేట, రైల్ పేటల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసి, మైక్రో ప్యాకెట్స్ ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. జీటీ రోడ్‌లో స్వీపింగ్ మెషిన్‌ల పనితీరు పరిశీలించి, మెయిన్ రోడ్ల డివైడర్ల పక్కన పరిశుభ్రంగా ఉండేలా ప్రతి రోజు స్వీపింగ్ జరగాలన్నారు.

యువతా మేలుకో - భవితను మార్చుకో

- వైఎస్సార్ సీపీ యువజన నేత నూనె ఉమామహేశ్వరరెడ్డి
- నేడు యువత పోరు


మాట్లాడుతున్న యువజన నాయకుడు ఉమామహేశ్వరరెడ్డి

నెహ్రూనగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని చెల్లించకుండా.. కూటమి ప్రభుత్వం విద్యార్థులను చదువులకి దూరం చేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనె ఉమామహేశ్వరరెడ్డి ఆరోపించారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి బుధవారం నిర్వహించనున్న 'యువత పోరు'ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 18,000 కోట్ల రూపాయలతో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలు విజయవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. 2018-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బకాయి పెట్టి పోయిన 1800 కోట్ల రూపాయల బకాయిలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే చెల్లించిన వాస్తవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే విధంగా 2023-24లో ఎన్నికల కోడ్ కారణంగా ఏర్పడిన బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత నుంచి ప్రస్తుత కూటమి ప్రభుత్వం పక్కకు తప్పుకోవడం సమంజసం కాదని హితవు పలికారు. ఆ బకాయిలతో కలిపి, ఇప్పటి వరకు 3900 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని వివరించారు. లక్షల మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు సంబంధించిన ఈ అంశంలో ఇంకా జాప్యం చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను వెంటనే విడుదల చేయాలని నూనె ఉమామహేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో ఆలా కిరణ్, కాటూరి విజయ్, చల్లా శివకోటి, ఏసోబు, పవన్, పేరపాగు బాబు, గోపి, సలీం, జిలాని, రాజు, పవన్ పాల్గొన్నారు.

డాక్టర్ షమ సుల్తానాకు 'ఉమెన్ అచ్చీవర్‌అవార్డు'


అవార్డు అందుకుంటున్న డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: 'అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు' గుంటూరు రీజినల్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక చుట్టుగుంట సెంటర్ ఐటీఏ కళ్యాణ మండపం మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వైద్య రంగంలో విశేష సేవలు అందించిన హోప్ విన్ హాస్పిటల్స్ చైర్ ఉమెన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానాకు 'ఉమెన్ అచ్చీవర్ అవార్డు'ను అందజేశారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య పరంగా అందిస్తున్న సేవలతోపాటు ప్రైవేట్ డాక్టర్లు కూడా తమ వంతు సేవలు అందించాలని కోరారు. భవిష్యత్‌లో డాక్టర్ షమ సుల్తానా పేద ప్రజలకు వైద్య పరంగా మరిన్ని వైద్య సేవలు అందించి మరెన్నో అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున రీసెర్చ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, గుంటూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ సయ్యద్ జవహర్, గుంటూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు డెప్యూటీ రీజినల్ హెడ్స్ అశ్వర్థ నాయక్, రాజేష్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పట్టాభిపురం బ్రాంచ్ హెడ్ ఆర్.అశ్విని పాల్గొన్నారు.

రేపటి తరం మార్కెట్ మేకర్స్‌పై పోటీలు


విజేతలతో ప్రిన్సిపాల్ గోపీచంద్, ఎస్సార్కే ప్రసాద్, నాగసుశీల

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో బీకాం తృతీయ సంవత్సర విద్యార్థులకు నెక్స్ట్‌జెన్ మార్కెట్ మేకర్స్ అనే అంశంపై మంగళవారం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా 124 మంది విద్యార్థులు 13 బృందాలుగా ఏర్పడి, వారి ఉత్పత్తులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్మార్ట్ హెల్మెట్, ఏఐ సీలింగ్ ఫ్యాన్, ఆప్టిక్ కళ్లజోడు, పార్కింగ్ సొల్యూషన్స్ తదితర ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. ప్రొడక్ట్ కాన్సెప్ట్, ప్రజెంటేషన్, టెక్నాలజీ, ప్రవర్తన, డ్రెస్‌కోడ్‌తో న్యాయ నిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చిన తీరును పరిగణలోకి తీసుని విజేతలను ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ తెలిపారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంచుతాయని అన్నారు. ఈసందర్భంగా తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన మౌనిక, కమల్, జై కుమార్ బృందాలకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, న్యాయనిర్ణేతలు పి.నాగసుశీల, టి.బాల నరేంద్ర ప్రసాద్, జె.హట్టి, జి.వేణుగోపాలరావు, కె.వేణు, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, కామర్స్ విభాగాధిపతి ఎం.అప్పారావు, అధ్యాపకులు కె.అంజనీదేవి, చరణ్ చౌదరి, ఎ. వెంకటకృష్ణ, కె.అరుణకుమారి, యు.వెంకటేశ్వరరావు, కె.కల్పన పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: గుంటూరు తిరుమలగా ప్రసిద్ధిగాంచిన బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచి కామకోటి పీఠాధిపతుల ఆశీస్సులతో ఆలయ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నాదస్వర స్వాగతాంజలి, మలిశెట్టి లక్ష్మీనారాయణ బృందం 'ఓం నమో వెంకటేశాయ' గానంతో ప్రారంభించారు. శ్రీవిశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణం వంటి పూజలను శ్రీమాన్ అగ్నిహోత్రం శోభనాచల లక్ష్మీనరసింహాచార్యుల ప్రధానార్చకత్వాన ఆలయ అర్చకులు పరుచూరి మాధవ స్వామి బృందం వేద మంత్రాలతో నిర్వహించారు. హారతి, మంత్రపుష్పం, హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీఆనందాశ్రమం(గండిపాలెం) ప్రసన్నానందగిరిస్వామి, ఆర్ష విద్యా కేంద్రం(గుంటూరు) బ్రహ్మనిష్ఠనంద సరస్వతిస్వామి అను గ్రహభాషణం చేశారు. ప్రసన్నానందగిరి స్వామి మాట్లాడుతూ భక్తి, ప్రేమ, క్షమాగుణంతో కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయవచ్చునని అన్నారు. బ్రహ్మనిష్ఠానంద సరస్వతీస్వామి మాట్లాడుతూ ఆత్మజ్ఞానం పొందాక శాంతి, సౌఖ్యం లభిస్తాయని చెప్పారు. శ్రీవేంకటేశ్వరస్వామి ధ్యానం దర్శనంతో ఆత్మజ్ఞానాన్ని సాధించాలని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారి దేవినేని కరుణచంద్రబాబు, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి కె.జి.శంకర్, పూర్వ ప్రొఫెసర్ ఆరేటి కృష్ణ కుమారి, ఈశ్వరీ విద్యాలయం బ్రహ్మకుమారి ఉమా, గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ స్వామి, వ్యాఖ్యాన సరస్వతి ఏవీకే సుజాతమాట్లాడగా, నోరి కోదండరామ్ వ్యాఖ్యతగా వ్యవహరించారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే రాణింపు

స్టెప్ సీఈఓ చంద్రముని


మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఆలోచనా విధానం సక్రమంగా ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని యువజన సర్వీసుల శాఖ, స్టెప్-స్వశక్తి సీఈఓ ఆర్.చంద్రముని పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కాలేజీ హైస్కూల్లో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం- కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చంద్రముని మాట్లాడుతూ ఉన్నతమైన ఆలోచనలను ఆచరణలో పెట్టినప్పుడు, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని అన్నారు. కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకుడు సీహెచ్ వెంకట్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎవరైతే చదువుతో పాటు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉంటారో, వారే జీవితంలో గొప్పస్థాయికి చేరుకుంటారని తెలిపారు. సృజనాత్మకశక్తిని వెలుగులోకి తీసుకువచ్చి, నచ్చిన రంగంలో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఉన్నత విద్య ద్వారా భవిష్యత్‌లో వచ్చే ఉద్యోగావకాశాలను గురించి వివరించారు. సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌వీఎస్ శర్మ పాల్గొన్నారు.

దివ్యాంగుడిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: దివ్యాంగుడిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టాభిపురం ప్రాంతానికి చెందిన వెంలుగు శివప్రసాద్, దివ్యాంగుడు కావడంతో చుట్టు గుంట సెంటర్ వద్ద ప్లాస్టిక్ సామాన్లు విక్రయించే బండి పెట్టుకుని జీవనం సాగిస్తుంటాడు. అయితే అదే ప్రదేశంలో శ్రీనివాసరావు పేటకు చెందిన బాషా అనే వ్యక్తి టిఫిన్ బండి పెట్టుకుని తనకు అడ్డుగా ఉందని చెప్పి దివ్యాంగుడు శివప్రసాద్‌ను బండి తొలిగించాలని చెప్పి దాడి చేసి గాయాల పాలు చేశాడు. దీంతో శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాషా అనే వ్యక్తి పై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

లక్ష్మీపురం: వివాహిత అదృశ్యంపై నగరం పాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏటీ అగ్రహారం 18వ లైన్ ప్రాంతానికి చెందిన బూసిరెడ్డి మాలాద్రి పొక్లెయిన్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మాలాద్రికి పది సంవత్సరాల కిత్రం హైమారాణితో వివాహం అయింది. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. అయితే 2024 డిసెంబర్ 22న మాలాద్రి ఇద్దరు పిల్లలతో కలిసి కనిగిరిలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి 24వ తేదీన గుంటూరు వచ్చారు. ఇంట్లో భార్య హైమారాణి కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వైభవంగా శ్రీసంతాన లక్ష్మీ నారాయణుల కల్యాణం



నగరపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డ రోడ్డులోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం గోపూజ, గణపతి పూజతో ప్రారంభించారు. తొలుత పుణ్యాహవచనం, మండపారాధన, ప్రవరలు, మహాసంకల్పంతో శ్రీ సంతానలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా జరిగింది. మహాహారతి, మంత్రపుష్పం అనంతరం కల్యాణానికి హాజరైన దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద, అన్నప్రసాద వితరణ చేశారు. ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ, ధర్మకర్త మర్రిపాటి పార్థసారథి పర్యవేక్షించారు.

గొర్రెలు, మేకలు సంక్షేమం కోసం నిధులు కేటాయించాలి



లక్ష్మీపురం: గొర్రెలు, మేకలు అభివృద్ధి- పెంపకం దారుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2500 కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర సమితి గౌరవాధ్యక్షులు కె.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గొర్రెల, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్ నుంచి ర్యాలీగా వెళ్లారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పొట్టేలు పెంటయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం పూర్వ నాయకులు పి.జమలయ్య మాట్లాడారు. అనంతరం సహకార ఫెడరేషన్ ఇన్‌చార్జి డాక్టర్ రజని కుమారికి వినతిపత్రం అందజేశారు.

ఈనెల 14న జిల్లా కేంద్రాల్లో నిరసన

లక్ష్మీపురం: ఈనెల 14న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో విశాఖకు ఉక్కు పరిరక్షణ కోసం నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ నగర కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం తమను ఎన్నుకోవాలని పెద్ద ఎత్తున విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం నిలబడతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణమే విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు కూరపాటి కోటయ్య, మేకల రవి, కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, బుజ్జి, అంజిబాబు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో ఈనెల 23న నిర్వహించనున్న తైక్వాండో పోటీలకు డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్పీ స్కూల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత్ రక్షా మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం అక్మే ఇంటర్నెషనల్ స్కూల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెల్ఫ్ డిఫెన్స్, కల్చరల్ పోటీల్లో భాగంగా తైక్వాండో విభాగంలో సత్తా చాటిన 7వ తరగతి విద్యార్థిని సీహెచ్ పూజిత, ఆరో తరగతి విద్యార్థి సీహెచ్ పవన్ కళ్యాణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యాబోధనతోపాటు విద్యార్థులు తైక్వాండోలో మంచి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శారీరకంగా, మానసికంగా ఉల్లాసాన్ని పొందడంతోపాటు చిన్నతనం నుంచే వివిధ రకాల పోటీ పరీక్షల్లో పాల్గొనడం వలన మేధాశక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవన్నయ్య, ఏఓ కె.వెంకట్రావు, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య విద్యార్థులతో పాటు తైక్వాండో శిక్షకులు బి.కాశీ, బి.సాయిని అభినందించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

లక్ష్మీపురం: ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. హామీ అమలు కోరుతూ అధికారులకు అర్జీలు అందించే కార్యక్రమం జిల్లాలో ఈనెల 15న గుంటూరులో 17,19వ తేదీన పొన్నూరులో, తెనాలిలో 20న నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు గని, కొల్లి రంగారెడ్డి, షేక్ వలి, జంగాల చైతన్య పాల్గొన్నారు.